క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ములగలంపాడులో నేతల చేతులమీదుగా చెక్కును అందుకుంటున్న నాగరాజు

లింగపాలెం: ములగలంపాడు గ్రామానికి చెందిన చింతలపూడి రంగ అనే మహిళ కేన్సర్ వ్యాధితో మృతి చెందింది. ఈమేరకు గురువారం ఆమె భర్త నాగరాజుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.1.20 లక్షల చెక్కును ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు, సర్పంచ్ ఇనుగంటి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మపాలెంలో సాయిబాబా మందిర 9వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులు తుమ్మల రాంబాబు, మార్గంపూడి సుబ్బారావులకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిడతా పెంటయ్య, సూరవరపు నాగరాంబాబు, సూరవరపు బాలయోగి, గంగుల రాజారావు, ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజస్తంభాన్ని ఆలయం వద్దకు లారీలో తీసుకువెళ్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో గురువారం 40 అడుగుల పొడవైన ఏక శిల ధ్వజస్తంభాన్ని అట్టహాసంగా ఊరేగించారు. మండలంలోని గుండుగొలనుకుంటలో చిలుకూరి ధర్మారావు తోటలో కండిగలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వచ్చేనెల 28న ఉదయం 9.17 నిమిషాలకు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో రూ. 5 లక్షల వ్యయంతో వరంగల్‌లో తయారు చేయించిన 40 అడుగుల ఏక శిల ధ్వజస్తంభాన్ని గురువారం క్షేత్రానికి లారీలో తీసుకొచ్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఈ ధ్వజస్తంభాన్ని నూతన ఆలయం వద్దకు తరలించారు. ఈ వేడుకలో చిలుకూరి ఫణి, నరసింహమూర్తి, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, చిలుకూరి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీ పెద్దిరెడ్డి రమ్యకుసుమ పాల్గొన్నారు.

కన్నెగంటికి నివాళి



కన్నెగంటికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమ సేనాని కన్నెగంటి హనుమంతు వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాపు సేవా సంఘం పేర్కొంది. ఆంధ్రా బ్యాంకు వద్ద వంగవీటి మోహన్ రంగా విగ్రహ ప్రాంగణంలో కన్నెగంటి 102వ వర్ధంతి కార్యక్రమం కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కన్నెగంటి హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చోడిపిండి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాపు సేవా సంఘం మండల శాఖ అధ్యక్షుడు మంచాల వెంకయ్యనాయుడు, మేకల అన్నవరం పాల్గొన్నారు.

అతివలకు ఆసరా

- అక్కచెల్లెమ్మల రుణం తీర్చుకున్న జగనన్న
- నియోజకవర్గంలో 5,962 డ్వాక్రా గ్రూపులు
- నాలుగు విడతల్లో రూ.265.62 కోట్ల రుణమాఫీ

చింతలపూడి: ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ మొత్తాన్ని చెల్లించారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారు. ప్రతి పథకంలో మహిళల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా బలోపేతం చేస్తూనే , మరోవైపు నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తున్నారు. ప్రతి పథకంలో మహిళలకు కల్పిస్తున్న ప్రాధాన్యతతో జగనన్న అతివలకు కొండంత ఆసరాగా మారడమే కాక మహిళల మనసుల్లో చెరగని ముద్ర వేశారు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న పేద మహిళల ఆర్థిక పురోగతికి మార్గం సుగమమైంది. ముఖ్యంగా వైఎస్సార్ ఆసరా పథకం అక్కచెల్లెమ్మలకు కొండంత భరోసా కల్పిస్తోంది. డ్వాక్రా సంఘాల మహిళా సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నాటికి బ్యాంకుల్లో ఎంత అయితే అప్పు మిగిలి ఉందో వాటిని ఆసరా పథకంలో మహిళా సంఘాలకు చెల్లించాలని నిర్ణయించారు. అధికారం చేపట్టిన తర్వాత నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసి మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఇటీవల నాలుగో విడత సొమ్మును ఆసరా సంబరాల్లో భాగంగా మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారు.



చింతలపూడిలో నాలుగో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నియోజకవర్గంలో 5,962 గ్రూపులకు ప్రయోజనం

నాలుగు విడతల్లో నియోజకవర్గంలోని 5,962 మహిళా సంఘాలకు మొత్తం రూ.265.62 కోట్ల రుణాలు మాఫీ చేశారు. ఈ ఏడాది నాలుగో విడతలో నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.66.4 కోట్లు జమ అయినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. అదే విధంగా చింతలపూడి మండలంలో నాలుగు విడతల్లో 2,054 గ్రూపులకు రూ.96.71 కోట్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 1,312 గ్రూపులకు రూ.51.8 కోట్లు, కామవరపుకోట మండలంలో 1,290 గ్రూపులకు రూ.62.13 కోట్లు, లింగపాలెం మండలంలో 1,306 గ్రూపులకు రూ.54.98 కోట్లు మాఫీ చేశారు.

మళ్లీ సీఎంగా జగనే రావాలి



మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. మా సరస్వతీ గ్రూప్‌నకు నాలుగు విడతలుగా రూ.4 లక్షలు రుణమాఫీ అయ్యింది. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ఎంతో చేదోడుగా నిలుస్తుంది. మహిళల సంక్షేమం ఇలానే కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలి.

– వల్లూరి ప్రభావతి, సరస్వతి గ్రూప్, మైసన్నగూడెం

పథకాల ద్వారా చేదోడుగా..



మహిళలకు అనేక పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడుగా నిలుస్తున్నారు. మా విజయలక్ష్మీ గ్రూప్‌నకు నాలుగు విడతలుగా రూ.9,09,412 రుణమాఫీ అయ్యింది. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణ పడి ఉంటాము. మళ్లీ సీఎంగా జగనన్ననే చేసుకుంటాం.

– మోటమర్రి రేవతి, విజయలక్ష్మీ గ్రూప్, మైసన్నగూడెం

ఆసరా డబ్బులతో పాడిగేదెలు కొన్నా



నేను వినాయక గ్రూప్ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకు నాకు రూ.72 వేలు రుణమాఫీ అయ్యింది. ఆ డబ్బులతో పాడి గేదెలను కొనుక్కుని వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గత టీడీపీ పాలనలో మాకు ఎటువంటి సహాయం అందలేదు. మమ్మల్ని ఆర్థికంగా ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము.

– మోటుమర్రి నాగలక్ష్మి, ఈస్ట్ ఎడవల్లి గ్రామం, కామవరపుకోట మండలం

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. లింగపాలెం మండలంలో అయ్యపరాజుగూడెం, కలరాయునగూడెం, భోగోలు, ములగలంపాడు, అన్నపనేనివారిగూడెం, కెగోకవరం, పాశ్వానగరం, శింగగూడెం, యడవల్లి గ్రామాల్లో రూ.4 కోట్ల 60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, హెల్త్ భవనాలు, కమ్యూనిటీ భవనాలను గురువారం ఎంపీ శ్రీధర్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా అందజేస్తున్నామన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు ఎంపి అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని శ్రీధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



అయ్యపరాజుగూడెంలో సచివాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, కంభం విజయరాజు

రెండుసార్లు వైఎస్సార్ సీపీకి బటన్ నొక్కండి

వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని అడ్డంకులు ఎదురైనా పేదలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికి 124 సార్లు వివిధ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ అక్కచెల్లెమల బ్యాంక్ ఖాతాలలో నేరుగా నగదు జమచేయటం జరిగిందన్నారు. ప్రజలు రెండు సార్లు బటన్ నొక్కి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మళ్లీ జగన్‌మోహనరెడ్డిని సీఎంను చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా చిట్టచివరి లబ్ధిదారుడి వరకూ సంక్షేమ ఫలాలను అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్‌చైర్మన్ దయాల నవీన్‌బాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొఠారి మోహన్, పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ధర్మాజీగూడెం, రంగాపురం సొసైటీ చైర్మన్ ఉప్పులపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్, గైడ్స్ దినోత్సవం



రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్స్, గైడ్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బిడెన్ పాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్‌లో విద్యార్థులు చేరడం వలన క్రమశిక్షణ, అంకితభావం, సేవాస్ఫూర్తి, నాయకత్వం లక్షణాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు, రాములు, పల్లాలు, సత్యనారాయణ, ప్రసాద్, సుజాత, దేవప్రియ, విజయకుమారి, గీతాదేవి రాజశ్రీ , పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: పరింపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం ఉమాదేవి, గైడ్ కెప్టెన్ బి.దుర్గారాణి ఆధ్వర్యంలో స్కౌట్స్ విద్యార్థులు దేశభక్తి అంశాలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటారు. సర్వ మత ప్రార్థనలు, ఆవిర్భావ దినోత్సవ విషయాలను ఉపాధ్యాయులు వివరించారు.



పరింపూడిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలికల హైస్కూల్ స్కౌట్స్ విద్యార్థులు

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జంగారెడ్డిగూడెం: మార్చి 9న జంగారెడ్డిగూడెం కోర్టు నందు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ కోరారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చునని అన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం, ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ కోసం 08812 224555 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటినుంచి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

కామవరపుకోట: ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23 తేదీ ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకము, కుంకుమ పూజలు, సాయంత్రం గండ దీపం వెలిగించుట, 24వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన, రాత్రి జానపద నాట్యం ప్రదర్శన, 25వ తేదీన స్వామివారి రథోత్సవం, ఆ రోజు రాత్రి నుంచి మార్చి 2వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని, భక్తులు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటిక

జంగారెడ్డిగూడెం: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో గురువారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై జంగారెడ్డిగూడెంలో వీధి నాటకాన్ని ప్రదర్శించారు. హెచ్ఐవీ నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ కేంద్రం ఏర్పాటు చేసినటువంటి ఐసీటీసీ సెంటర్స్‌కి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే సీడీ ఫోర్ కౌంట్ తో సంబంధం లేకుండా ఏఆర్‌టీ మందులు వాడాలన్నారు. అలాగే 1097 టోల్ ఫ్రీ నెంబర్, హెచ్ఐవీ 2017 యాక్ట్, నాకో యాప్ డౌన్‌లోడ్, రక్త దానం చేయవలసిన అవసరం, దాని వల్ల కలిగే లాభాలు, పీపీటీసీటీ సెంటర్స్, టీబీ, క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హాస్యపు సన్నివేశాలతో కూడిన నాటిక ద్వారా వివరించారు. ఏలూరు నగరానికి చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు ఎం.కుమార్, ఎం.తిరుపతి, వి.రమేష్, వి.రాజేష్, ఎం.సాయి. వి.వాణి వీధి నాటిక ప్రదర్శించారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా



బుట్టాయగూడెంలో కళాప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బుట్టాయగూడెం: హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరుకు చెందిన కళాకారులు గురువారం స్థానిక బస్‌స్టాప్ వద్ద కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఎయిడ్స్ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ అయితే సీడీ ఫోర్ కౌంట్‌తో సంబంధం లేకుండా ఏఆర్‌టీ మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఎం.కుమార్, ఎం.తిరుపతి, వీ.రమేష్, వి.రాజేష్, ఎం.సాయి, వి.వాణి తదితరులు పాల్గొన్నారు.

లింగాల కాంతమ్మ సంస్మరణ సభ

కొయ్యలగూడెం: దివంగత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా రజక సంఘం అధ్యక్షురాలు లింగాల కాంతమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మకు వారసురాలిగా లింగాల కాంతమ్మను పరిసర ప్రాంత ప్రజలు పేర్కొంటూ ఉండేవారని అన్నారు. డ్వాక్రా సంఘాలను బలవపేతం చేయడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో కాంతమ్మకు జిల్లాలోని ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయన్నారు. రజక సంఘం జిల్లా మండల నాయకులు డ్వాక్రా గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

జంగారెడ్డిగూడెం: హర్యానాలో రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద రైతు కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. అనంతరం ఏవో సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ అధ్యక్షత వహించగా, నాయకులు మాట్లాడారు. గత పది రోజులుగా రైతుల సమస్యలపై ఢిల్లీలో రైతు ఉద్యమం జరుగుతుందని, వారికి మద్దతుగా పంజాబ్ నుంచి బయలుదేరిన రైతు పాదయాత్ర హర్యానా సరిహద్దులోకి ప్రవేశించగానే అక్కడి ప్రభుత్వం శత్రు సైనికులపై యుద్ధం చేస్తున్నట్లుగా రైతులపై భాష్పవాయువు, కాల్పులు చేశారన్నారు. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వాన్ని బర్త్‌రఫ్ చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించకుంటే దేశవ్యాప్త నిరసన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సీపీఐ నాయకులు జేవీ రామనరాజు, ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణరాజు, ఐఎఫ్‌టీయూ వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎం.జీవరత్నం, రైతు కూలీ సంఘం నాయకులు తలారి ప్రకాష్, జె.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు ముప్పిడి శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: తిరుమలదేవిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రోడ్డు క్రాసింగ్ పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిరుమలదేవిపేట, శ్రీరామవరం, ఏపుగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మ భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలన్నారు. అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, యం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, ఆఫీస్ సిబ్బందిపాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట: కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు పొందడంతో, కుటుంబానికి ఆర్థికంగా చేయూతను అందించవచ్చని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సతీమణి రేణుక అన్నారు. కామవరపుకోటలో కొత్తూరు పంచాయతీ కార్యాలయాల వద్ద గతంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ద్వారా టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తపన ఫౌండేషన్ సభ్యులు నరకుళ్ళ ఆశ, గణేష్, లక్ష్మీనారాయణ, టైలరింగ్ శిక్షకురాలు లక్ష్మీ, అంబికా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీ హెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కానూరి విజయ్, కానూరి సాయి, కానూరి నాగేంద్ర, తిప్పాని మణిదీప్ గరుడపక్షి నగర్‌లో కలిసి ఉంటున్నారు. మా గురించి అందరికీ చెడుగా చెబుతావా అంటూ వారందరూ ఈనెల 21వ తేదీ రాత్రి తనను కొట్టి గాయపర్చారని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిదీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.